క్లుప్తంగా

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: నియోజకవర్గంలో ఇటీవల ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో హోమ్ మంత్రి తానేటి వనిత గురువారం రాత్రి నియామక పత్రాలను అందజేశారు. కార్యకర్తగా రొట్ట సుబ్బలక్ష్మి, హెల్పర్లగా పోలుమాటి రత్నకుమారి, షేక్ షాహిన్ బేగం, చిన్నమర్తి వెంకటలక్ష్మి ఎంపికయ్యారు. సీడీపీవో డి.మమ్మి, దొమ్మేరు, దారవరం సర్పంచులు తానింకి కుమారి, మద్దుకూరి రవి, ముదునూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సమక్షంలో జరిగే సమావేశానికి మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

నల్లజర్ల: స్థానిక ఏకేఆర్జీ కళాశాలలో నబీపేటకు చెందిన మెరిట్ విద్యార్థి మర్రి దీప్తి ఎంఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమెకు ఫీజుల నిమిత్తం మండల మానవత సంస్థ గురువారం రూ.10వేలు ఆర్థిక సాయం చేసింది. గతేడాది ఆమెకు మానవత సంస్థ ఆర్థికసాయం చేసింది. మానవత జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు ఐడీపీ అప్పారావు, పాతూరిసత్యనారాయణ, ఉప్పాడ కామేశ్వరావు, నందం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఉండ్రాజవరం: వడ్లూరు గ్రామంలో కోమరపు జగదీష్ తల్లి అప్పలసూరమ్మ, మేతికమిల్లి శ్రీనివాసు కుమారుడు ఎం.సాయి, గ్రామ సర్పంచ్ రఘుమండ శ్రీను తాతయ్య అప్పలనాయుడు, చెల్లింకి త్రిమూర్తులు సోదరుడు చెల్లంకి కుమార్ ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పరామర్శించారు. అనారోగ్యానికి గురైన వైఎస్సార్ సీపీ నాయకులు పోత్తూరి కృష్ణంరాజును కలిసి పరామర్శించారు. ఆయన వెంట జేసీఎస్ మండల కన్వీనర్ కఠారు సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యులు వేంద్ర రమేష్, మల్లుల సత్యనారాయణ, బయ్యే సత్తిపండు, వేగిశ్న నాగరాజు, తానేంకి సత్యనారాయణ, రాపాక కొండయ్య, కట్టా శ్రీను, పి.పసలయ్య టున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠంలో దూరవిద్య ద్వారా పది, ఇంటర్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెంటర్ నిర్వాహకులు అంబటి శ్రీనివాసరకావు కోరారు. గురువారం నుంచి ఆగస్టు 31వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తులు అందించాలన్నారు. పది, ఇంటర్ ఒకే సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించవచ్చునన్నారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించాలి

నల్లజర్ల: సమస్యలను విద్యుత్‌శాఖ అధికారులు పరిష్కరించకుంటే కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్)దృష్టికి తీసుకురావాలని ఫోరం అధ్యక్షుడు బి.సత్యనారాయణ వినియోగదారులకు సూచించారు. గురువారం నల్లజర్లలో విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఫోరం చైర్మన్ మాట్లాడుతూ పరిష్కారం కాని సమస్యల వివరాలు తగిన ఆధారాలతో ఫోరంకు నివేదిస్తే ఇరువురి వాదనలు విన్న తర్వాత విద్యుత్ సంస్థ లోపమైతే పరిహారం ఇప్పించే అవకాశం ఉందన్నారు. తరచూ విద్యుత్ సమస్యలు ఏర్పడినట్టయితే టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. పరిష్కారవేదికకు ముందు స్థానిక ఎస్ఆర్‌కే కళాశాలలో విద్యార్థులతో ఫోరం చైర్మన్ సత్యనారాయణ మాట్లాడారు.ఆయనతోపాటు ఫోరం సభ్యులు ఎస్.హరిబాబు, ఆర్.సురేంద్రకుమార్, నల్లజర్ల ఏఈ బాపిరాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా బీజేపీ

నిడదవోలు రూరల్: రైతులకు అండగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందని బీజేపీ మండల అధ్యక్షుడు మాట్ల వెంకట దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలో కోరుమామిడిలో ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద రైతులతో బీజేపీ నాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు సానెపు కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో రోడ్లపైకి చేరిన గోదావరి వరద నీరు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద ముంపులో షిరిడి సాయి ఆలయం



మద్దూరులంకలో గోదావరి ఉధ్ధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు



చిట్యాలలో ముంపులోని వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి

గోదావరీ

- పెరుగుతున్న గోదావరి ఉధృతి
- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో రోడ్లపైకి చేరిన వరదనీరు
- ముంపు ప్రాంతాలను పరిశీలించి ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: గోదావరిలో వరద డేంజర్ బెల్స్ మోగిస్తోంది. స్థానిక గోష్పాదక్షేత్రాన్ని వరద ముంచెత్తింది. వరదనీరు క్షేత్రంలో రోడ్లపైకి చేరింది. గోష్పాదక్షేత్రం వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. క్షేత్రం వద్ద జనాలను లోపలికి వెళ్లకుండా ఉండేందుకు స్టాఫర్స్‌ను, గస్తీని ఏర్పాటు చేశారు. మరో వైపు ధవళేశ్వరం ఆనకట్ట వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావడంతో లంక గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు డివిజన్ వ్యాప్తంగా గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయానికి గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 13.5 మిల్లీమీటర్లు సరాసరి వర్షపాతం నమోదైంది.

వరద ఉధృతి పరిశీలించిన ఆర్డీవో

ఆర్డీవో ఎస్.మల్లిబాబు అధికారులతో కలిసి గురువారం మధ్యాహ్నం మండలంలో మద్దూరులంక, పల్లెపాలెం వద్ద గోదావరి వరద ఉధృతి పరిశీలించారు. గోదావరి నది గర్భంలో నివాసం ఉంటున్న 15 కుటుంబాలకు చెందిన 42 మందిని అవసరమైతే పునరావాసానికి తరలించాలని ఆర్డీవో ఆదేశించారు. దీనిలో భాగంగా మద్దూరు హైస్కూలులో పునరావాసం కల్పించేందుకు వసతులను ఆయన పరిశీలించారు. గోదావరి వరద మరింత పెరిగితే పల్లెపాలెం ప్రాంత వాసులను పునరావాస కేంద్రానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు తహసీల్దార్ బి.నాగరాజు తెలిపారు. గోదావరి నదీ తీరం ప్రాంతంలో ఉన్న పంచాయతీలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో ఆదేశించారు.

లంక భూములను ముంచెత్తిన వరద

గోదావరి వరదకి తోడు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పటికే గోపాలపురం, కొవ్వూరు, చాగల్లు, పెరవలి, తాళ్లపూడి మండలాల్లో సుమారు 400 ఎకరాలు వరి పంట ముంపు బారిన పడినట్టు అధికారులు గుర్తించారు. తాళ్లపూడి, పెరవలి, కొవ్వూరు, నిడదవోలు మండలాల పరిధిలో లంక భూముల్లో వరదనీరు ప్రవేశించింది. లంకల్లో సాగు చేస్తున్న కూర గాయాలు, అరటి, కంద, పూల తోటలను వరద నీరు ముంచెత్తింది. ఎగువ భద్రచలంలో వరద కాస్త నెమ్మదించినప్పటికీ ఎగువ ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు కారణంగా వరద ఉధృతి మరో రెండు రోజులు పాటు కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ముంపు బారిన 1,508 ఎకరాలు

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా 8 మండలాల్లో 24 గ్రామాల్లో లోతట్టు ప్రాంతంలో ఉన్న 1,508 ఎకరాలు ముంపు బారిన పడినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దీనిలో అత్యధికంగా కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో 1,110 ఎకరాలు ఉంది. కొవ్వూరులో అత్యధికంగా 501, గోపాలపురంలో 322 ఎకరాలు, చాగల్లులో 49, దేవరపల్లిలో 72,నల్లజర్లలో 87, తాళ్లపూడి మండలంలో 79 ఎకరాలు ముంపు బారినపడినట్లు గుర్తించారు. గోకవరం మండలంలో రెండు గ్రామాల్లో 322 ఎకరాలు, కోరుకొండలో మూడు గ్రామాల్లో 74 ఎకరాల్లోను పంట ముంపుబారిన పడింది.

గోదారమ్మ ఉగ్రరూపం

పెరవలి: రోజురోజుకి వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. ఎగువ నుంచి వరద వచ్చి చేరడంతో ప్రవహ ఉధృతి పెరుగుతోంది. లంక గ్రామాల చుట్టు నీరు చేరింది. పంటలు నీటమునగగా, పశువులకు గూడు కరువైంది. పెరవలి మండలంలో కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో దిగువ లంకల్లో 800 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. గురువారం ఉదయం నిలకడగా ఉండగా తరువాత కొద్దికొద్దిగా పెరిగి దిగువ లంక పూర్తిగా మునిగి పై లంకలకు చేరింది. వరద మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయానికి పైలంకలు పూర్తిగా మునిగే అవకాశం ఉందని చెప్పారు. ఇదే జరిగితే మొత్తం పెరవలి మండలంలో గోదావరి లంకల్లో సాగు చేస్తున్న 3 వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా నాశనం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట ఒబ్బిడి

గోదావరికి ఒకపైపు వరద వేగంగా పెరుగుతుంటే రైతులు అంతకంటే వేగంగా పండించిన పంటలను ఒబ్బిడి చేసుకుంటున్నారు. ముఖ్యంగా కంద పంటను ఏదోవిధంగా ఒబ్బిడి చేసుకుంటే పెట్టుబడి అయినా వస్తుందనే ఉద్దేశంతో కూలీలకు అధిక ధర ఇచ్చి తవ్వకాలు చేపట్టారు. పెరవలి మండలంలో లంకలో కంద పంట సుమారు 100 ఎకరాలు ఉంది. గత ఏడాది ఇలాగే వదలివేశామని కనీసం ఒక్క దుంపకూడా దక్కలేదని అందుకు ముందస్తుగా తవ్వకాలు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

పొంగి ప్రవహిస్తున్న కొవ్వాడ కాలువ

తాళ్లపూడి: కొవ్వాడ కాలువ ఉగ్రరూపం దాల్చింది. మండలంలోని పోచవరం వద్ద గురువారం ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి అధిక వర్షాలు కారణంగా వరద వచ్చి చేరింది. ఈ వరద మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. పోచవరం నుంచి గూటాల వైపు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డుపై నుంచి వరదనీరు అర కిలోమీటరు మేర 10 అడుగుల ఎత్తున ప్రవహిస్తోంది. దీంతో ఇటు వైపు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. అదేవిధంగా రాగోలపల్లి సమీపంలోని పల్లపు ప్రాంతంలోని వరి, కూర గాయలు తదితర పంట పొలాలు వరదనీటి ముంపులో పడ్డాయి. అన్నవేవరపేటలోని రెండు కల్వర్టులపై నుంచి నీరు ప్రవహిస్తోంది.

నీట మునిగిన వరి పొలాల పరిశీలన

గోపాలపురం: కురిసిన వర్షాలకు మండలంలోని చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో నీటమునిగిన వరిపొలాలను గురువారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు. ఆయన వెంట ఏఈ బి.రాజారావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నాయకులు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, కాకులపాటి శ్రీనివాసరావు ఉన్నారు.



ముక్కామలలో నీటిమునిగిన పంటలు



ఉమ్మిడివారిపాలెం వద్ద నీటమునిగిన మునగ తోట



రాగోలపల్లి సమీపంలో పంట చేలను ముంచెత్తిన వరదనీరు

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- సత్యవాడలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఉండ్రాజవరం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సత్యవాడ గ్రామంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, సర్పంచ్ ఇందుకూరి దేవి భార్గవి, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారు సిద్ధార్థరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ఐవీఎస్ రాజు, నడుంపల్లి శ్రీనివాసరాజు, మరపట్ల నాగరాజు, దేయ్యాల రాముడు, మరపట్ల కిట్టయ్య, నడుంపల్లి జానకీరామరాజు, కోటాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సత్యవాడలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

జగనన్న సురక్షతో అర్హులందరికీ మేలు

జగనన్న సురక్ష గ్రామసభలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వెంకటాయపాలెం సర్పంచ్ మేకా సతీష్ అధ్యక్షతన గురువారం జగనన్న సురక్ష గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ నెల రోజులుగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతోందన్నారు. 630మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, చిట్యాల సొసైటీ చైర్మన్ దుగ్గిరాల రమేష్‌బాబు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బల్లిపాడులో జగనన్న సురక్ష

తాళ్లపూడి: బల్లిపాడు జేబీ స్కూల్ వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు పాల్గొని గ్రామస్తులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీడీవో వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, తహసీల్దార్ టి రాధిక, ఉప సర్పంచ్ ఎం.దమయంతి, ముళ్ల పోశిబాబు, ఈవోపీఆర్డీ కె.ఎస్ వీరన్న , కోపర్షన్ సభ్యురాలు కటాక్షం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరిలో సంతోషం

నిడదవోలు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైన ధ్రువీకరణ పత్రాలు పొంది ప్రతి ఒక్కరిలో సంతోషం నింపిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో శెట్టిపేట, సింగవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను సర్పంచులు జడ్డు శ్రీలక్ష్మి, పెన్మెత్స వెంకటలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. శెట్టిపేటలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు,నాయకులు పాల్గొన్నారు.

మీనా నగరాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలి

చాగల్లు: చాగల్లు గ్రామ పంచాయతీ నుంచి మీనానగరాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడంపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణకు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈసభలో మీనానగరం గ్రామ నాయకులు గంగవరపు రాజేంద్రప్రసాద్, మట్టా సుబ్బారావు, బొర్రా రజినీ ప్రసాద్‌లు మాట్లాడుతూ మీనానగరంలో 2 వేల జనాభా ఉందని, ఎన్నో ఏళ్లుగా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ఆదేశాలతో మీనానగరాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలంతా సహకరించాలని కోరారు. చాగల్లుకు చెందిన నాయకులు పాలకుర్తి ప్రభాకర్‌చౌదరి, జుట్టా ఏడుకొండలు తదితరులు మాట్లాడుతూ చాగల్లులో మీనానగరం కలిసి ఉంటే బాగుంటుందని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యదర్శి ఎల్.రవికుమార్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నమట్ల మనశాంతి, ఆత్మ చైర్మన్ గంట్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



చాగల్లు పంచాయతీ వద్ద జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి ఎల్.రవికుమార్

ఫొటోగ్రాఫర్ల నూతన కార్యవర్గం

నిడదవోలు: స్థానిక ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మేడ పూర్ణచంద్రావు, కార్యదర్శి షేక్ సి.రాజుద్దీన్, గౌరవాధ్యక్షుడు ఎన్‌వీవీ రమణ, ఉపాధ్యాక్షుడు నిచ్చెనకొళ్ల రాజు, కోశాధికారి ముత్త వెంకటేశ్వరావు, సంయుక్త కార్యదర్శి అడబాల నరేష్, పీఆర్‌వో ఉప్మాకుల శ్రీనులు ఎంపికయ్యారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశంలో నిర్వహించారు.

ఆమోదించిన అంశాలు

పట్టణంలో 6వ వార్డులో 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ నిధులు రూ.6.50లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. పట్టణంలో రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న అవుట్ పాల్ డ్రైన్‌ను కొంగల బాడవ వరకూ పూడిక తొలగించాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. 11వ వార్డులో రామాలయం వద్ద కల్వర్టు నిర్మాణానికి దాఖలైన టెండర్లను ఖరారు చేశారు. అదే వార్డులో జీఎస్‌రావు కల్యాణ మండపం వెనుక వైపు కల్వర్టు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. 15వ వార్డు శ్రీనివాసపురంలో ఐటీఐ కళాశాల సమీపంలో రోడ్డు నిర్మాణానికి రూ.15లక్షలు సాధారణ నిధులు నుంచి వెచ్చించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 16వ వార్డు ఔరంగబాద్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి సచివాలయానికి వెళ్లే రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి రూ.15లక్షలు సాధారణ నిధులతో నిర్మించేందుకు సమావేశంలో నిర్ణయించారు. ఐదో వార్డులో సీసీ డ్రైన్ నిర్మాణానికి, మద్దిపట్ల వారి వీధిలో హ్యాండ్ బోరు ఏర్పాటుకి ఆమోదం తెలిపారు. పట్టణంలో వీధి కుక్కలు నిర్మూలనకు రూ.లక్ష నిధులు కేటాయించారు. జూలై నెలకి సంబంధించిన ఆదాయ, వ్యయాలను సమావేశానికి వివరించారు.

పలు అంశాలపై సమీక్ష

పట్టణంలో రుడా ఆధ్వర్యంలో చేపట్టిన డివైడర్ ఆధునికీకరణ పనులు విషయంతో సమావేశంలో వాడీవేడిగా చర్చసాగింది. కౌన్సిల్ ఆమోదం లేకుండా రుడా పనులు చేపట్టడాన్ని టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని తప్పుబట్టారు. వైఎస్సార్ సీపీ సభ్యుడు కంఠమణి రమేష్ మాట్లాడుతూ రుడా చేపట్టే పనులను కౌన్సిల్ ముందు ఉంచితే ఆ పనులపై చర్చించే అవకాశం ఉంటుందన్నారు. సీనియర్ కౌన్సిల్ సభ్యులు కోడూరి శివరామకృష్ణ మాట్లాడుతూ కౌన్సిల్‌తో తీర్మానం చేసి సభ్యులు అభిప్రాయాలు తీసుకుంటే బాగుండేదన్నారు. ఈ పనులకు రుడా నిధులతో చేపట్టారని, పర్యవేక్షణ కుడా రుడా చేస్తుందని కమిషనర్ బి.శ్రీకాంత్ సభ్యులకు వివరించారు. డంపింగ్ యార్డు చెత్త తొలగింపు ఖర్చు విషయంపై సభ్యులు ప్రశ్నించగా పై స్థాయి నుంచి ఆదేశాల మేరకే పనులు చేపట్టామని కమిషనర్ స్పష్టం చేశారు. కౌన్సిలర్ బత్తి నాగరాజు మాట్లాడుతూ కౌన్సిల్‌లో కొత్త పనులు పెడుతున్నారని, గతంలో ఆమోదించిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని, పర్యవేక్షణ కొరవడిందని చిన్ని ఆరోపించారు. డంపింగ్ యార్డులో చెత్త శుభ్రం చేయగా వచ్చిన మట్టి వాటర్ వర్క్సు వద్ద పోశారని,దానిలో మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉన్నాయని ఆరోపించారు. వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంట్రోతు అంజనీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రత్నకుమారి

వ్యాధుల కాలం పరిశుభ్రతే ప్రధానం

నల్లజర్ల: ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా పరిసరాల పరిశుభ్రతకు, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న 50వ ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని సుభద్రపాలెం గ్రామంలో పోతవరం పీహెచ్‌సీ డాక్టరు ఎల్.రాజశేఖర్‌తో కలసి గురువారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎం, ఆశ, వలంటీర్లతో సర్వే బృందాలు పర్యటిస్తున్నాయని, ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యదర్శి విజయ, ఆరోగ్య సహాయకులు ఆనంద్‌కుమార్, కార్యకర్త భారతి, ఎంఎల్‌హెచ్‌పీ సుజీ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

పెరవలి: పశువులకు గొంతు వాపు వ్యాధి రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో ఖండవల్లి, తీపర్రు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల్లో గురువారం ఏటి గట్టుపై ఉన్న పశువులకు టీకాలు వేశారు.

45 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు

కిలో గరిష్ట ధర రూ.284, సగటు ధర రూ.235

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పొగాకు అమ్మకాలు వేగంగా జరుగుతున్నాయి. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో గురువారం 45.01 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు చేశారు. దీని విలువ రూ.1.05 వేల కోట్లు ఉంది. కిలో సగటు ధర రూ.284, సగటు ధర రూ.235 పలుకుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 96 రోజులు వేలం నిర్వహించారు. 3,74,944 బేళ్ల వేలం కేంద్రంలో అమ్ముడుపోయాయి. మరొక ఏడు మిలియన్ల కిలోల పొగాకు రైతుల వద్ద అమ్మకానికి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు రెండో వారంలో జిల్లాలో పొగాకు అమ్మకాలు ముగియనున్నాయి. దేవరపల్లి వేలం కేంద్రంలో 8.27 మిలియన్ల కిలోలు విక్రయించగా, కిలో సగటు ధర రూ. 231.95, గోపాలపురం వేలం కేంద్రంలో 8.17 మిలియన్ల కిలోలు కొనుగోలు చేయగా, సగటు ధర రూ.238.45 లభించింది. 50 ఏళ్ల పొగాకు పంట చరిత్రలో ఇటువంటి మార్కెట్ చూడలేదని అధికారులు అంటున్నారు.



దేవరపల్లిలో జరుగుతున్న పొగాకు వేలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలు

కొవ్వూరు: గామన్ ఇండియా బ్రిడ్జి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రాజానగరం మండలం వెలుగుబండకి చెందిన ముక్కపాటి శ్రీనివాసరావు అనే వ్యక్తి గాయాలపాలయ్యారు. కొవ్వూరులో పండ్ల వ్యాపారం చేసుకునే శ్రీనివాసరావు ఈనెల 26వ తేదీన మోటారుసైకిల్ పై ఇంటికి వెస్తుండగా మార్గ మధ్యలో నాలుగో వంతెనపై ప్రమాదానికి గురయ్యారు. శ్రీనివాసరావుకి బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు అతని భార్య వెంకట రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నిడదవోలు : పర్యావరణ పరిరక్షణకు అందరు బాధ్యతగా మొక్కలను నాటాలని నిడదవోలు రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలో ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అందించారు. ఈకార్యక్రమంలో మాచర్ల మధుసూధనరావు, ప్రిన్సిపాల్ రుద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే

చాగల్లు: ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని బీఎల్వోలకు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి సూచించారు. బ్రాహ్మణగూడెంలో జరుగుతున్న ఇంటింటి ఓటర్ల జాబితా ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఓటర్ల జాబితా సక్రమంగా ఉన్నాయా, లేదా అని నిశితంగా పరిశీలించాలన్నారు. వీఆర్వో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

దేవరపల్లి: భీమోలులో సారా బట్టీలపై దేవరపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) స్టేషన్ సీఐ డి.సుధ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. గ్రామంలో సారా తయారు చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు సీఐ డి.సుధ గురువారం తెలిపారు. దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, పరారీలో ఉన్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. నిందితులను కొవ్వూరు కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఆమె చెప్పారు. స్థావరం వద్ద 225 లీటర్ల సారా, 5 గ్యాస్ సిలిండర్లు, సెల్‌ఫోన్, స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 2800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఆమె చెప్పారు.